

పాగాల సంపత్‌రెడ్డి సంతాపసభకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

# ప్రజానేత పాగాల సంపత్‌రెడ్డి

- జడ్పీ చైర్మన్‌గా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి సేవలు
- కేసీఆర్ మనసులో ఉన్న వ్యక్తి
- ప్రజా సేవలో మమేకమైన నాయకుడు
- సంపత్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం
- జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి
- బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన సంతాప సభలో పాగాలకు ఘన నివాళులు
- హాజరైన మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, తాటికొండ, ప్రజాప్రతినిధులు, నాయకులు

జనగామ, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : 'ఉద్యమ వీరుడా..అలుపెరుగని యోధుడా.. జోహార్ సంపతన్న.. జోహార్ జోహార్.. నీకేవే మా కన్నీటి వీడ్కోలు' అంటూ జనగామ జడ్పీచైర్మన్ పాగాల సంపత్‌రెడ్డికి గులాబీశ్రేణులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటించారు. గుండెపోటుతో హఠాన్మరణం పొందిన పాగాల సంతాప సభ బుధవారం బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించగా, వేలాది మంది కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. జడ్పీ చైర్మన్‌గా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి సేవలను కొనియాడుతూ కన్నీటి నివాళులర్పించారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్య, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 'ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీ బ్రహ్మాండంగా ఉంది.. మనందరం పార్టీకి అండగా ఉన్నాం.. స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నుంచి అద్భుతమైన ఫలితాలు ఇచ్చి విజయం సాధించాం.. మళ్లీ మన ప్రభుత్వం రాలేదని అత్యంత ఎక్కువ బాధపడ్డది సంపత్‌రెడ్డి..' అని అన్నారు. కేసీఆర్ మనసులో ఉన్న వ్యక్తి.. చిరస్మరణీయుడు సంపత్‌రెడ్డి అని బాధాతప్త హృదయంతో నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో అందరూ పాల్గొన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ పదవుల కోసం ఆశపడి ఉద్యమంలోకి ఎవరూ రాలేదు.. ఆ మాదిరిగానే తెలంగాణ రావాలి.. రాష్ట్రం బాగుపడాలనే ఉద్దేశంతోనే సంపత్‌రెడ్డి ఉద్యమంలోకి వచ్చారు.. పార్టీ కోసమే నిరంతరం కష్టపడే వ్యక్తి.. ఉద్యమంలో ఏనాడూ సంపాదించలేదన్నారు. 'గ్రామీణ ప్రాంతాల్లో నీకార్సుగా ఉన్న నాయకుల్లో సంపత్‌రెడ్డి మొదటి స్థానంలో ఉన్నాడు.. ఆయనకు ఉన్న బలగం ఎవరికీ లేదు.. ఇది కేవలం ఆయనకే సాధ్యమైంది..' అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి నివాళులర్పించారు. మా ఉద్యమకారుడు సంపత్‌రెడ్డికి మంచి స్థానంలో పదవి కట్ట బెట్టాలని ప్రతిసారి కేసీఆర్ గుర్తు చేసేవారని, ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఇవ్వాలని అందుకే ఆయనకు జడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా జోడు పదవులు అప్పగించారని గుర్తు చేశారు. ఉద్యమకారుడు మాట ఆలా ఉంటుందని, 2001లో మొదటి నుంచి ఉద్యమంలో పని చేశాడు కాబట్టే పదవులు అప్పగించారని, సంపత్ మీద కేసీఆర్‌కు ఏనలేని ప్రేమ ఉంటుందన్నారు. సంపత్ కుటుంబానికి తాను వ్యక్తిగతంగా ఆండగా ఉంటా.. అయనకు ఉన్న అప్పు తీర్చే బాధ్యత మేమే తీసుకుంటాం.. ఆర్థికంగా మేమందరం చూసుకుంటాం.. ఆ కుటుంబానికి ఎలాంటి ఇబ్బంది కలుగనివ్వం.. సంపత్ నాకు తమ్ముడు కంటే ఎక్కువ అని అన్నారు. ప్రభుత్వం లేదని నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, ఏ గ్రామంలో చూసినా గులాబీ నాయకులు ఎక్కువగా ఉన్నారని, ఎవరూ మనుసును గాయం చేసుకోవద్దు.. మిమ్మల్ని అక్కున చేర్చుకొంటా అని పల్లా శ్రేణులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఐదేళ్లు నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి బాధ వచ్చిన జిల్లా నుంచి గెలిచిన కడియం శ్రీహరి, నేను పంచుకుంటాం అని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు ఇండ్లల్లో దాడులు చేస్తున్నారని, అనవసరంగా దూషిస్తే ఊరుకోం..గెలిచినా ఓడినా గ్రామాల్లో ఎక్కువగా బలగం మనదే ఉన్నదని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో మనం మళ్లీ గెలుస్తాం..అందరం ఓపిక పడుదాం.. గులాబీ జెండాకు అండగా ఉందాం.. సంపత్‌రెడ్డి కోసం వేలాది మంది తరలివచ్చి ఘనమైన నివాళులర్పించారు. ప్రజా నాయకుడంటే ఇలాగే ఉండాలని అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, బీఆర్ఎస్ నాయకులు మండల శ్రీరాములు, ఇర్రి రమణారెడ్డి, ఏడవెల్లి కృష్ణారెడ్డి, మద్దూరు ఎంపీపీ బద్దిపడుగ కృష్ణారెడ్డి, లింగాలఘనపురం జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి సహా పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు.

## సంపత్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం.. : కడియం



రాష్ట్రంలో మళ్లీ మన ప్రభుత్వం రాలేదనే ఆవేదనతో సంపత్‌రెడ్డికి గుండెపోటు వచ్చి హఠాన్మరణం చెందడం.. ఆయన సంతాపసభలో పాల్గొనడం బాధగా ఉందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్రంలో పార్టీ ఓడిపోతుందనుకోలేదు.. భయంగా ఉందని నాతో చెప్పాడని, త్వరలోనే మనకు మంచి రోజులు వస్తాయని నేను చెప్పి ధైర్యం ఇచ్చానని ఆయన గుర్తుచేశారు. సంపత్‌రెడ్డి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ పరంగా అన్ని జిల్లాల్లో సంతాప సభలు ఏర్పాటు చేసి నివాళులర్పించారని అన్నారు. కుటుంబపరంగా ఆదుకుంటాం.. సంపత్‌రెడ్డి కుమార్తె చదువు బాధ్యత తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ క్యాడర్‌ను కొంత ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఒక్క మా నియోజకవర్గాల్లోనే కాదు.. ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో, నాకు అనుబంధం ఉందని, వందకు వంద శాతం పార్టీ కార్యకర్తలను, వారి ఆస్తులను కాపాడుకుంటాం అని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం..ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. సింహం రెండు అడుగులు వెనుకకు వేసిందంటే పొజిషన్ చూసుకొని జంప్ చేస్తుందని అర్థం అని భరోసా ఇస్తూ ఆరు నెలలు ఓపిక పడుదాం అని గులాబీ శ్రేణులకు కడియం శ్రీహరి పిలుపునిచ్చారు.

## చురుకైన నేత సంపత్‌రెడ్డి : ముత్తిరెడ్డి



ఉద్యమంలో సంపత్‌రెడ్డి చురుకైన పాత్ర పోషించారు.. నిబద్ధత గల నాయకుడిగా సేవలందించాడని జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నివాళులర్పించారు. ఆయన అకాల మరణం నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. సంపత్‌రెడ్డి మృతి బీఆర్ఎస్ కుటుంబానికి, జనగామ జిల్లాకు తీరని లోటన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యం కలిగించాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నా అని నివాళులర్పించారు.

## మలిదశ ఉద్యమ నేత పాగాల : తాటికొండ



మలిదశ ఉద్యమ ముఖ్య భూమిక పోషించిన పాగాల సంపత్‌రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతలను, అభివృద్ధి ఫలాలను జిల్లా ప్రజలకు అందించాడని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా గులాబీ పార్టీతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకుని నివాళులర్పించారు.



పాగాల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వినోద్‌కుమార్

## పాగాల కుటుంబానికి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పరామర్శ

చిల్పూరు, డిసెంబర్ 6 : జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి మృతి సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ వైస్ చైర్మన్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ బుధవారం రాజవరం గ్రామానికి వచ్చారు. సంపత్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పాగాల సంపత్‌రెడ్డి తండ్రి జయపాల్‌రెడ్డి, సోదరులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ 2004 నుంచి 2009 వరకు తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో సంపత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో క్రియాశీలకంగా పనిచేశారని తెలిపారు. పార్టీ అవిర్భావం నుంచి చురుగ్గా ప్రజాసేవలో పాల్గొన్న గొప్ప నాయకుడు అని పేర్కొన్నారు. సంపత్‌రెడ్డి హఠాన్మరణం కుటుంబ సభ్యులకు, ప్రజలకు, బీఆర్ఎస్‌కు తీరని లోటని అన్నారు. ఆయన వెంట ఎడవెల్లి విజయ, వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## కబడ్డీ పోటీల్లో జనగామకు రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం

జనగామ చౌరస్తా, డిసెంబర్ 6 : సీనియర్ మహిళా కబడ్డీ పోటీల్లో జనగామ జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించింది. రూ.5 వేల నగదుతో పాటు మెమోంటోను తెలంగాణ స్టేట్ ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ జగదీశ్ యాదవ్, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి గట్టయ్య యాదవ్ చేతుల మీదుగా అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా భూసాపూర్‌లో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు పోటీలు జరిగాయి. ఫైనల్ మ్యాచ్‌లో జనగామ జట్టు నల్గొండ జట్టుపై 34/22 పాయింట్లతో విజయం సాధించి తృతీయ స్థానం గెలుచుకుంది. కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, టీమ్ కోచ్ డాక్టర్ తోటకూరి వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ కబడ్డీ జట్టులో పన్నీరు ధనూష (కెప్టెన్), ఇల్లందుల సుష్మిత, చింత సోని, మాలోతు అఖిల, శ్రీపతి అక్షర, తోకల సింధు, భూక్యా స్నేహలత, చెట్టబోయిన అఖిల, బానోతు వర్ష, చింతకుంట్ల రేణుక, గంగపురం సాత్విక, లోకుల ప్రవళిక ప్రతిభకనబర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ టీమ్ మేనేజర్ కుడుముల మైథిలి పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం పొందిన జనగామ జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ జట్టు




సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రశర్మ

## 30న జాతీయ లోక్ అదాలత్

### జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీ రవీంద్రశర్మ

జనగామ చౌరస్తా, డిసెంబర్ 6 : జనగామ జిల్లా కోర్టు ఆవరణలో ఈ నెల 30వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డీ రవీంద్ర శర్మ అన్నారు. బుధవారం కోర్టు హాల్‌లో వెస్ట్‌జోన్ డీసీపీ పీ సీతారామ్‌తో కలిసి ఆయన అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవింద్ర శర్మ మాట్లాడుతూ కక్షిదారులు ఎక్కువ సంఖ్యలో హాజరై తమ కేసులు పరిష్కరించుకునేలా పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, న్యూసెన్స్, చీటింగ్, పిటీ, యాక్సిడెంట్ కేసుల వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీ విక్రమ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ సుచరిత, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకట్రాం నర్సయ్య, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.